

దేశ రక్షకులు..

ఆపరేషన్ సిందూర్



- 'ఆపరేషన్ సిందూర్'లో కోసిగి సైనికులు
- దేశ భద్రతే లక్ష్యంగా సైన్యంలోకి
- సరిహద్దులో పాక్‌తో వీరోచిత పోరాటం
- జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న చింతకుంట యువకులు



రాజస్థాన్‌లో విధులు నిర్వహిస్తున్న చిన్నభోంపల్లి ఆర్మీ పోలీసు కేబీ మల్లికార్జున



జమ్మూకశ్మీర్ బార్డర్‌లో విధులు నిర్వహిస్తున్న చింతకుంట ఆర్మీ పోలీసు జుమాల మారయ్య

కోసిగి, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ సేవలో సైనికులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. దేశ ప్రజల ప్రాణాలకు వారి ప్రాణాలను పణంగా పెట్టడంతోనే స్వేచ్ఛగా జీవిస్తున్నాం. భారతదేశ రక్షణలో ముందుండే ఆర్మీ వ్యవస్థ నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉంటూ మనకు స్వేచ్ఛా వాయువులు ఇస్తున్న జవాన్ల త్యాగం అనిర్వచనీయం. ఎండ, చలి, వర్షం ఇలా ఏదీ లెక్క చేయకుండా అహర్నిశలు సంసిద్ధులై శత్రుదేశాల బారి నుంచి రక్షించే నిజమైన యోధులు మన సైనికులు. 24 గంటల పాటు దేశ సరిహద్దులో ఉంటూ ప్రాణాలను లెక్క చేయకుండా దేశ రక్షణలో తరిస్తున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా శత్రువుల తుపాకుల నుంచి వచ్చే బుల్లెట్లు, బాంబుల మోతలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ అత్యంత క్లిష్ట సమయాల్లో నిత్యం ప్రాణసంకటంగా జీవితాన్ని గడిపే వీర జవాన్లే మన ధైర్యం. అలాంటి సైన్యంలో కర్నూలు జిల్లా నుంచి కూడా ఎంతోమంది యువకులు సేవలందిస్తున్నారు. మరీ ముఖ్యంగా అక్షరాస్యతలో అట్టడుగు స్థానంలో ఉన్న కోసిగి మండలంలోని మారుమూల గ్రామాల నుంచి యువకులు ఆర్మీలో ఉంటూ దేశ సేవలో తరిస్తున్నారు. ప్రస్తుతం సరిహద్దులో జరుగుతున్న 'ఆపరేషన్ సిందూర్'లో ప్రాణాలను అడ్డుపెట్టి శత్రుదేశం పాకిస్థాన్ దాడులను తిప్పికొడుతున్నారు.



కే.నరసింహారెడ్డి

తమ కుటుంబాలను దేశ సరిహద్దులో విడిచి రాత్రింబవళ్లు అప్రమత్తంగా ఉంటూ దేశాన్ని కాపాడుతున్నారు కోసిగి మండలంలోని మారుమూల గ్రామాల యువకులు. మండలంలోని దేవరబెట్ట, చిన్నభోంపల్లి, జంపాపురం, చింతకుంట, సజ్జలగుడ్డం, తదితర గ్రామాల నుంచి సుమారు 30 మందికి పైగా సైనికులు దేశం రక్షణ కోసం ప్రాణాలు సైతం అడ్డు పెట్టి విధులు నిర్వహిస్తున్నారు. చింతకుంట గ్రామానికి చెందిన సైనికులు ప్రస్తుత ఇండో-పాక్‌ల మధ్య ఉద్రిక్తత పరిస్థితుల్లో ప్రాణాలు సైతం పణంగా పెట్టి ఉగ్రమూకలను ఎదుర్కొంటున్నారు. కోసిగి మండల పేరుతో పాటు సొంతూరు, తల్లిదండ్రుల పేరును నిలబెట్టే దిశగా సామాన్య కుటుంబం నుంచి ప్రభుత్వ పాఠశాలలో కష్టపడి చదివి దేశ సేవ కోసం ఆర్మీ పోలీసులుగా ఎంపికై దేశ సేవలో తరిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



డాగ్ స్క్వాడ్‌లో విధులు నిర్వహిస్తున్న చింతకుంట ఆర్మీ పోలీసు హనుమయ్యగారి వీరేంద్ర



ఒకే ఇంటి నుంచి ఇద్దరు

కోసిగి మండలం సజ్జలగుడ్డం పంచాయతీలోని దేవరబెట్ట గ్రామంలో తలారి గోపాల్, మల్లీశ్వరిలకు ఇద్దరు కుమారులు. వీరిలో తలారీ విష్ణు రాజస్థాన్‌లోని ఇంటర్నేషనల్ బార్డర్‌లో విధులు నిర్వహిస్తుండగా.. తలారీ విశ్వనాథ్ అస్సాంలోని లేఖ్‌పణి హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇలా ఒకే ఇంట్లో తమ ఇద్దరు కుమారులు దేశసేవకు వదలడం గర్వంగా ఉందని తల్లిదండ్రులు తలారి గోపాల్, మల్లీశ్వరి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జంపాపురం నుంచి ఆరుగురు

జంపాపురం గ్రామానికి చెందిన గుడ్డేగారి బసవరాజు, నరసింహారెడ్డి, తిరుమల్ రెడ్డి, రాజేష్, కోసిగయ్య, రాఘవేంద్ర రెడ్డి... మొత్తం ఆరుగురు దేశ సరిహద్దులో రక్షణ విధులు నిర్వహిస్తున్నారు. ఒకే గ్రామం నుంచి ఆరుగురు దేశ సేవలో ఉండటం తమ గ్రామానికే గర్వకారణమని అక్కడి ప్రజలు సగర్వంగా చెబుతున్నారు.

దేశ రక్షణకు ప్రాణాలైనా అర్పిస్తా

నాకు సైనికదళంలో ఉద్యోగం వచ్చి నాలుగు సంవత్సరాలు అవుతోంది. నా సొంత తమ్ముడు కూడా సైన్యంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఒకే ఇంట్లో నుంచి అన్నదమ్ములు దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించడానికి సిద్ధంగా ఉన్నాం. మా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే దేశ సేవలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా.

- దేవరబెట్ట తలారి విష్ణు



సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న దేవరబెట్టకు చెందిన తలారీ విష్ణు (ఫైల్)



చింతకుంట నుంచి ఏడుగురు

చింతకుంట గ్రామం నుంచి ఏడుగురు సైనికులు దేశ సేవలో విధులు నిర్వహిస్తున్నారు. జల్లా మహాదేవ్, నెంగి రాఘవేంద్ర, జుమాల మారయ్య, నెంగి మాధవరెడ్డి, హనుమయ్యగారి వీరేంద్ర, కప్ప శ్రీనివాసులు, బద్రి ఆంజనేయ, చిన్నభోంపల్లి గ్రామానికి చెందిన కేబీ మల్లికార్జున దేశ సరిహద్దులోని వివిధ ప్రాంతాల్లో పహారా కాస్తున్నారు. ప్రస్తుతం వీరందరూ 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొన్నట్టు సమాచారం.



జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న చింతకుంట గ్రామ ఆర్మీ పోలీసు నెంగి రాఘవేంద్ర



ఛత్తీస్‌ఘడ్‌లో విధులు నిర్వహిస్తున్న చింతకుంట ఆర్మీ పోలీసు జల్లా మహదేవ్

దేశ రక్షణకే జీవితం



నాకు 22 ఏళ్ల వయసులోనే ఆర్మీలో ఉద్యోగం వచ్చింది. బెంగళూరులో శిక్షణ పూర్తి చేసుకున్నా. దేశ రక్షణ కోసం జీవితాంతం పని చేయడానికి సిద్ధంగా ఉంటా. సొంత ఊరికి, తల్లిదండ్రులకు పేరుప్రఖ్యాతలు తీసుకురావడమే నా ధ్యేయం. పాక్ దురాగతాలను సమర్థవంతంగా ఎదుర్కొవడమే లక్ష్యం.

- రాఘవేంద్రరెడ్డి



ఆర్మీ జవాన్ గుడ్డేగారి బసవరాజు

సాగు విస్తీర్ణం ఖరారు

జిల్లాలో 3.57 లక్షల హెక్టార్లలో పంటల సాగు అంచనా

కర్నూలు అగ్రికల్చర్, మే 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో ప్రారంభం కానున్న పంట సాగు విస్తీర్ణం జిల్లా వ్యవసాయాధికారులు ఖరారు చేశారు. పత్తి పంట అధిక విస్తీర్ణంలో సాగవుతుందని స్పష్టం చేస్తున్నారు. వివిధ పంటల సాగు విస్తీర్ణం వివరాలను పరిశీలిస్తే వరి ధాన్యం 1,29,019 హెక్టార్లు, జొన్న 313 హెక్టార్లు, సద్ద 3,939 హెక్టార్లు, మొక్క జొన్న 5,101 హెక్టార్లు, కొర్ర 2,679 హెక్టార్లు, కందులు 33,296 హెక్టార్లు, పెసలు 203 హెక్టార్లు, వివిధ ఆహార పంటలు 58,466 హెక్టార్లలో సాగవుతుందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. వేరుశనగ 54,710 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 826 హెక్టార్లు ఆముదం 8,951 హెక్టార్లు, సోయాబీన్ 126 హెక్టార్లు వివిధ పంటలకు సంబంధించి విత్తనాల సాగు 64,618 హెక్టార్లు, పత్తి 2,34,409 హెక్టార్లు, చెరుకు 127 హెక్టార్లు అన్నిపంటలు కలిపి 3,57,633 హెక్టార్లలో పంటలు సాగవుతాయని ఆమె చెప్పారు.

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ ద్వారా ఏపీ టెట్‌లో అర్హత సాధించిన బీసీ ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి మెగా డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కర్నూలు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సాధికారిత అధికారి కే.ప్రసూన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో అభ్యర్థులకు దరఖాస్తులను ఉచితంగా పొందవచ్చని వివరించారు. టెట్‌కు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తుకు టెట్ మార్కులిస్టు, రెండు ఫొటోలు, క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ, ఆధార్ జిరాక్స్ కాపీలను జతపర్చాలని పేర్కొన్నారు. కర్నూలు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో పూర్తిచేసిన దరఖాస్తులను అభ్యర్థులు స్వయంగా అందించాలని, మరిన్ని వివరాలకు 08518-236076, 9550266273 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అమరవీరుడు మురళీనాయక్

విమానాశ్రయంలో నివాళులర్పించిన సీఎం చంద్రబాబు

ఓర్వకల్లు, మే 9 (ఆంధ్రజ్యోతి): భారతమాత రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు జవాన్ మురళీనాయక్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అనంతపురం జిల్లా పర్యటన అనంతరం తిరుగు ప్రయాణంలో భాగంగా శుక్రవారం 5:55 గంటలకు సీఎం చంద్రబాబు ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. దేశ రక్షణ విధుల్లో ఉండగా పాక్ సైనికుల కాల్పుల్లో వీరమరణం పొందిన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటం ఎదుట పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన తెలుగువీరుడు మురళీనాయక్ అని కొనియాడారు. చంద్రబాబుతో పాటు డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆర్డీవో సందీప్ కుమార్, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ విద్యాసాగర్ తదితరులు వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక విమానంలో సీఎం చంద్రబాబు అమరావతికి బయలుదేరి వెళ్లారు.



నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరిత, డీఐజీ కోయ ప్రవీణ్

పోలీస్.. ఇదేం తీరు..!

- గుర్తు తెలియని శవంపై పోలీసుల వైఖరిపై విమర్శలు
- స్పాట్‌కు వెళ్లి.. వదిలేయడంపై అనుమానాలు
- కేసు నమోదు చేయకుండా.. ఫొటోలు డిలీట్?
- గడివేముల పోలీసుల తీరుపై ఆరోపణలు

నంద్యాల/గడివేముల, మే 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో పోలీసుల తీరు ఏదో ఒక విధంగా వివాదాలకు దారి తీస్తోంది. పోలీసుల సమన్వయలోపం, వారి నిర్లక్ష్యం తదితర అంశాలతో నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. కేసు ఎలాంటిదైనా సరే నిక్కచ్చిగా వ్యవహరించి నిజాలు వెలుగులోకి తెచ్చి చట్టం దృష్టిలో దోషులుగా నిలబెట్టాల్సిన పోలీసులు.. కనీస ఉద్యోగ బాధ్యతలు కూడా నిర్వహించడం లేదు. తాజాగా గడివేముల మండలంలో ఓ వ్యక్తి మృతికి సంబంధించిన సంఘటనలో పోలీసులు వ్యవహరించిన తీరు మొత్తం డిపార్ట్‌మెంట్‌కే మచ్చ తెచ్చేలా ఉంది. ఓ వ్యక్తి మృతి ఘటనలో 'ఆ..ఇదంతా మనకెందుకు వచ్చిన తంటా' అనుకున్నారో ఏమో ఆ ఘటనకు సంబంధించిన ఆనవాళ్లు లేకుండా చేసిన వ్యవహారంలో పోలీసులపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



పొలంలో దహనం చేసినట్లు ఉన్న ఆనవాళ్లు

పోలీసుల తీరుపై విమర్శలు..

గడివేమల మండలంలో ఓ రైతు తన పొలంలో గత నెల 28వ తేదీన జొన్న పంటను తొలగిస్తుం డగా.. గుర్తు తెలియని మానవ అస్థి పంజరం (ఎముకలు, చెప్పులు, ప్యాంట్ తదితర) ఆనవాళ్లు బయటపడ్డాయి. ఈ క్రమంలో కోత మిషన్ డ్రైవర్‌తో పాటు కూలీలు కూడా సదరు అస్థి పంజరాలను చూశారు.

మిగతా 7వ పేజీలో

అందాల రాయబారులు

నేడు ప్రపంచ వలస పక్షుల దినోత్సవం





(కర్నూలు నగర శివారులోని గార్గేయపురం చెరువులో ఇలా విదేశీ వలస పక్షులు శుక్రవారం కనువిందు చేశాయి. ఆహార అన్వేషణలో వేల కిలోమీటర్లు ప్రయాణించి గార్గేయపురం చెరువు, చెట్లపై ఇలా వలస పక్షులు వాలాయి. ఈ అందాల పక్షులను ఆంధ్రజ్యోతి తన కెమెరాలో ఇలా బంధించింది)

- కర్నూలు రూరల్ (ఆంధ్రజ్యోతి)
ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు

అందాల రాయబారులు..
అంతరంగంలో అపురూపంగా
బహిరంగంలో అందంగా
వలస బాట పట్టి
దేశాలన్నీ చుట్టేస్తూ
స్వేచ్ఛగా స్వచ్ఛమైన గాలిలో
ప్రకృతి అందాల్ని ఆస్వాదిస్తూ
కొత్త గూడు కట్టి
ప్రకృతి పాట పాడి
కందనవోలుకు చేరిన
అందాల రాయబారులవి..



పోలీస్.. ఇదేం తీరు..!

(5వ పేజీ తరువాయి)

దీంతో వెంటనే సంబంధిత పోలీసులకు రైతు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని స్పష్టత లేని ఆనవాళ్లు ఉన్నాయని గ్రహించారో..? లేక గుర్తు తెలియని శవం కదా..? భవిష్యత్‌లో మనకెందుకు సమస్య అని వదిలేశారో...? కానీ స్పాట్‌కు వెళ్లి ఎలాంటి కేసు నమోదు చేయకుండా వచ్చేశారు. తర్వాత ఆనవాళ్లతో సహా అస్థిపంజరం కాలిబూడిదైంది. అయితే పోలీసులే ఇలా అస్థిపంజరంతో పాటు ఆనవాళ్లు కూడా లేకుండా చేశారని పలువురు విమర్శిస్తున్నారు. అయితే సంఘటనా స్థలంలో ఆనవాళ్లు, అస్థిపంజరం ఫొటోలను అక్కడ ఉన్న రైతు, ఇతర వ్యక్తుల సెల్‌ఫోన్లను తీసుకుని డిలీట్ చేయించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

వెలుగులోకి ఇలా...

అస్థిపంజరం, ఇతర ఆనవాళ్ల ఫొటోలను డిలీట్ చేయించినా.. ఓ వ్యక్తి స్క్రీన్‌షాట్ తీసుకోవడంతో మరో ఫోల్డర్‌లో ఫొటోలు ఉండిపోయాయి. దీంతో ఆ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మృతుడి ఆనవాళ్లను గుట్టుచప్పుడు కాకుండా దహనం చేశారంటూ మండలంలో చర్చగా మారింది. ఈ ఫొటోలు, పోలీసుల వైఖరి రెండు రోజులుగా వైరల్‌గా మారడంతో ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో డీఎస్పీతో పాటు మరికొందరు పోలీసులను అప్రమత్తం చేసినట్లు సమాచారం. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

లోతుగా దర్యాప్తు చేస్తాం



ఎస్బీ ద్వారా లోతుగా విచారణ చేస్తాం. ఏదైనా తప్పిదాలు చేసినట్లు తెలిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. ఈ కేసుపై ప్రత్యేక దృష్టి పెడతాం. గుర్తుతెలియని వ్యక్తి మృతిపై విచారణ చేస్తాం. వైరల్ మారడంతో మా దృష్టికి వచ్చింది. పోలీసులు కూడా వెంటనే స్పందించేలా చర్యలు తీసుకుంటాం. ఏ కేసులోనూ నిర్లక్ష్యంగా ఉండకుండా చూస్తాం.

- అధిరాజ్‌సింగ్ రాణా, ఎస్పీ, నంద్యాల



పొలం సమీపంలో రక్తపు మరకలతో ఉన్న వస్త్రం

పోలీసుల తీరు వెనుక...

సాధారణంగా గుర్తు తెలియని శవం, ఆనవాళ్లు లభ్యమైతే వెంటనే పోస్టుమార్టం నిర్వహించి విచారణ చేపడతారు. కానీ ఈ కేసులో గడివేముల పోలీసులు వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తోంది. గుర్తు తెలియని శవం ఆనవాళ్లు ఉన్నాయని సమాచారం ఇచ్చినా కనీసం విచారణ చేయకుండా చేతులు దులుపుకోవడం వెనుక అంతర్యమేమిటో? పైగా ఆనవాళ్లు లేకుండా దహనం కావడం, 'మా పొలంలో ఎలాంటి శవం ఆనవాళ్లు లేవు..' అంటూ పొలం యజమానితో మాట్లాడించడం.. 12 రోజులైనా కేసు నమోదు చేయకపోవడం వంటి అంశాలన్నీ పలు అనుమానాలకు తావిస్తున్నాయి.

మృతుడి వివరాలు తెలిసేదెలా?

గుర్తు తెలియని వ్యక్తి మృతికి సంబంధించి సమగ్ర వివరాలు బయటికి వస్తే.. కొంతవరకు అసలు విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. పోలీసులు స్పాట్‌కు వెళ్లి వెనక్కి ఎందుకువచ్చారు. ఫొటోలను ఎందుకు డిలీట్ చేయించారు? ఆ తర్వాత ఆనవాళ్ల దహనం? ఈ ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. ఇదిలా ఉండగా ఇద్దరు (ఎస్‌ఐ, కానిస్టేబుల్) పోలీసులు అక్కడికి వెళ్లి.. అక్కడి నుంచి తమ ఉన్నతాధికారికి ఫోన్ చేసిన తరువాత ఈ తతంగం జరిగిందని ప్రచారం సాగుతోంది. ఆనవాళ్లన్నీ మటుమాయం అయ్యాక మృతుడి వివరాలు తెలిసేదెలా? అన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఏది ఏమైనా ఈ వ్యవహారం పోలీసులకు సవాల్‌గానే మారింది. ఈ ఘటనపై పోలీసుల చర్యలు ఏవిధంగా ఉంటాయో వేచి చూడాలి. ఈ ఘటనపై గడివేముల ఎస్‌ఐ నాగార్జునరెడ్డిని వివరణ కోరగా గుర్తు తెలియని వ్యక్తి శవం సమాచారం రావడంతో రైతులను విచారించామని అన్నారు. రైతు తన పొలంలోని వ్యర్థాలను కాల్చి వేస్తుండగా రెండు ఎముకలు కనపడినట్లు తెలిపాడని అన్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాలేదని అన్నారు.

'పత్తి' సాగుపై దృష్టి

- గతేడాది మంచి దిగుబడులు
- లాభాల బాట పట్టిన అన్నదాతలు
- రాష్ట్రస్థాయిలోనే ఉమ్మడి జిల్లా మొదటి స్థానం
- మేలు రకపు విత్తనాలను అందుబాటులో..

కర్నూలు అగ్రికల్చర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వస్తున్న పత్తి దిగుబడులను చూసి ఈయేడు కూడా రైతులు పత్తిని సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వరుసగా మూడేళ్ల నుంచి పత్తి సాగులో ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లానే మొదటి స్థానాన్ని దక్కించుకుంటోంది. గతేడాది ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో 2.20లక్షల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 30వేల హెక్టార్లలో పత్తి పంట సాగైంది. ఖరీఫ్‌లో వాతావరణం అనుకూలించడంతో ఒక ఎకరాకు 8నుంచి 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి రైతుల చేతికి అందింది. వ్యాపారులు క్వింటానికి 6వేల నుంచి రూ.6,500 చెల్లిస్తే సీసీఐ సంస్థ రూ.7,520 చెల్లించింది. దీంతో రైతులు పత్తి పంట సాగుతో లాభాల బాట పట్టారు. అందువల్ల రైతులు మరో నెల రోజుల్లో మొదలయ్యే ఖరీఫ్ సీజన్‌లో పత్తిపంటనే అత్యధికంగా సాగు చేసే అవకాశాలున్నాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ ఏడాది కూడా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 2.70లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతుందని వ్యవసాయాధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పత్తిలో అధిక దిగుబడిని ఇచ్చే విత్తన రకాలను వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 25లక్షల ప్యాకెట్లు పత్తి సాగుకు అవసరమవుతాయని అధికారులు అంచనా. కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు, ఆలూరు, పత్తికొండ, డోన్, పాణ్యం, నందికొట్కూరు, నంద్యాల తదితర నియోజక వర్గాల్లో ఇప్పటికే మేలురకం పత్తి విత్తనాల కోసం రైతులు విత్తనాల డీలర్ల వద్ద క్యూ కడుతున్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

ఆదోని అగ్రికల్చర్, మే 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. ఆదోని మండలం ఇస్వీ గ్రామం దగ్గర ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 103 కేసుల్లో పట్టుబడిన 1,903 లీటర్లు రూ.8లక్షలు విలువచేసే కర్ణాటక మద్యాన్ని కర్నూలు ఏఈఎస్ పర్యవేక్షణలో సీఐ సైదులు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు.

యంత్రంలో పడి రైతు మృతి

కోడుమూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్ల గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఓరైతు ప్రమాదవశాత్తు మొక్కజొన్న యంత్రంలో పడి మృతి చెందారు. వివరాలివీ.. గ్రామానికి చెందిన మద్దిలేటి (58) హంద్రీ అవతల ఉన్న రెండెకరాల సొంత పొలంలో మొక్కజొన్న సాగు చేశారు. శుక్రవారం యంత్రం సాయంతో మొక్కజొన్న కోత జరిపించడానికి పొలానికి వెళ్లారు. పంటను యంత్రం కోత చేస్తుండగా, రైతు మద్దిలేటి రాలిపోయిన మొక్కజొన్న కంకులను సంచిలో వేసుకుని తెచ్చి యంత్రంలోకి వేస్తున్నారు. ఈక్రమంలో మొక్కజొన్న కంకులను యంత్రంలో వేస్తుండగా పట్టుతప్పి యంత్రంలో పడ్డారు. దీంతో కాళ్లు యంత్రంలో ఇరుక్కుపోయాయి. ఆ సమయంలో రైతు పెద్దగా అరవడంతో గమనించిన డ్రైవర్ అప్రమత్తమై ఇంజిన్ నిలిపివేశాడు. వెంటనే కిందకు దిగివచ్చి ఇతరుల సాయంతో యంత్రంలో ఇరుక్కుపోయిన మద్దిలేటిని చాలాసేపు శ్రమించి బయటకు తీశారు. అప్పటికే చేరుకున్న 108 వాహనంలో కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రైతు మృతి చెందినట్లు తెలపడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోయారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మద్దిలేటికి భార్య శివమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మృతుడు మద్దిలేటి గాజులదిన్నె ప్రాజెక్టు 10వ నీటిసంఘంలో టీసీ మెంబర్‌గా కొనసాగుతున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే నేరాలకు అడ్డుకట్ట

కర్నూలు క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతోనే నేరాలకు అడ్డుకట్ట వేస్తామని అడిషినల్ ఎస్పీ హుస్సేన్‌పీరా తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో వ్యాస్ ఆడిటోరియంలో ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల అధికారులు, దర్యాప్తు అధికారులు, స్టేషన్ రైటర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసాచారి, ఉపేంద్రబాబు, వెంకట్రామయ్య, రామాంజి నాయక్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై సమీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలపై ఆర్ఐవో ఎస్వీఎస్ గురువయ్యశెట్టి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. నగరంలోని టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటు ఆఫీసర్స్, కస్టోడియన్స్‌కు అవగాహన కల్పించారు. మొత్తం 21,324 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని ఆయన తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీవీఈవో సురేష్‌బాబు, ప్రిన్సిపాల్స్ సుంకన్న, పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై అహోబిలేశుడు



అశ్వవాహనంపై ఊరేగుతున్న నృసింహస్వామి

ఆళ్లగడ్డ, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో నృసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారు అశ్వవాహనంపై ఊరేగారు. ఆలయ మేనేజర్ మాధవన్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామికి ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ స్వామి, మణియర్ సౌమ్యనారాయణన్ అభిషేకాలు, నవకలశ తొట్టి తిరుమంజనం నిర్వహించారు. చెన్నైకు చెందిన గోపాల, అహోబిలానికి చెందిన ప్రహ్లాద వరద కైంకర్య సభ, ఆళ్లగడ్డకు చెందిన నాగశేఖర్ ఉభయదారులుగా వ్యవహరించారు. స్వామివారి ఉత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బైక్ దొంగలు అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు

కర్నూలు క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి) : మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మోటారు సైకిళ్లు చోరీ చేసిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రాత్రి డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ శేషయ్యలు నిందితుల వివరాలు వెల్లడించారు. కర్నూలుకు చెందిన తెలుగు కళ్యాణ్, పెద్దరాజు, షేక్ ఖాజా మొహిద్దీన్‌తో పాటు మరో మైనర్ బాలుడు(నిద్దూరు)లను అరెస్టు చేశారు. నిందితులు కొద్ది కాలంగా నగరంలో పలుచోట్ల మోటారు సైకిళ్లు చోరీచేశారు. నిందితులను అరెస్టు చేసి మూడు రాయల్ ఎన్‌ఫీల్డ్, ఎనిమిది పల్సర్స్, రెండు స్ప్లెండర్‌ప్లస్, మరో రెండు హోండా మోటారు సైకిళ్లను రికవరీ చేశారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

ఎస్ఈ రాజశేఖర్ ఈఎన్‌సీ ఆఫీస్‌కు సరెండర్

కర్నూలు న్యూసిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థలో పని చేస్తున్న సూపరింటెండెంటింగ్ ఇంజనీర్(ఎస్‌ఈ) రాజశేఖర్‌ను ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) కార్యాలయంలో రిపోర్టు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు ఈఎన్‌సీ కార్యాలయం నుంచి తక్షణమే రాజశేఖర్ ఎస్‌ఈ రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈతకెళ్లి యువకుడి మృతి

ఉయ్యాలవాడ, మే 9(ఆంధ్రజ్యోతి): ఈతకెళ్లి యువకుడు మృతి చెందాడు. ఈఘటన గోవిందపల్లె గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన షేక్ మాబూ జానీ(25) గ్రామంలో జరుగుతున్న ఉమామహేశ్వర స్వామి పునఃప్రతిష్ఠ ఉత్సవానికి తన బంధువుల ఇంటికి వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసుకొని ఆళ్లగడ్డకు చెందిన తన నలుగురు మిత్రులతో కలిసి ఈతకు వెళ్లారు. మాబూజాన్‌కు ఈత రాకపోవటంతో రెండు ప్లాస్టిక్ డబ్బాలను తాడుతో నడుముకు కట్టుకొని బావిలోకి దిగాడు. నడుముకు కట్టుకున్న తాడు తెగిపోవటంతో ఈత కొట్టలేక నీళ్లలో మునిగిపోయాడు. స్థానికులు గుర్తించి గజ ఈతగాళ్ల సాయం తో మృతుడిని బయటకు తెచ్చారు. ఒక్కగానొక్క కొడుకును కోల్పోవ టంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటుకున్నాయి. మృతుడి తండ్రి షేక్ ఖాదర్ వలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మురళీనాయక్‌ది వీరమరణం

దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన మంత్రి ఫరూక్



నంద్యాల రూరల్ , మే 9 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా వీరమరణం పొందిన శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీ నాయక్ వీరమరణం తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. వీరజవాన్ చూపిన ధైర్య సాహసాలు దేశానికే గర్వకారణమన్నారు. ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు మురళీనాయక్ అని మంత్రి కొనియాడారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ'

- ప్రతి రైతుకు రూ.20వేల ఆర్థికసాయం
- ఉమ్మడి జిల్లాలో 50వేల మందికి ప్రయోజనం
- అర్హుల జాబితాను సిద్ధంచేస్తున్న అధికార యంత్రాంగం



కర్నూలు అగ్రికల్చర్, మే 9 (ఆంధ్రజ్యోతి): కౌలురైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది. 'అన్నదాత సుఖీభవ' ద్వారా పెట్టుబడి సాయాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి రూ.20వేల ఆర్థికసాయం ఇవ్వనుంది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో ఇస్తారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా అందిస్తున్న 6వేల మొత్తాన్ని కలిపి రూ.20వేలను రైతులకు అందజేయనున్నారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 50వేల మంది కౌలు రైతులు ఈ పథకం కింద లబ్ధి పొందనున్నారు. ఈ నెలలో ఈ పథకాన్ని రైతులకు అమలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.20వేల చొప్పున సాయం అందజేయనుంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో అర్హులైన రైతుల జాబితాను సిద్ధం చేసే పనుల్లో అధికారులు ఉన్నారు. ఈ నెల 20వ తేదీలోపు ఈ జాబితాను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. సీఎం చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ఈ నెలలోనే ప్రారంభిస్తారని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదు లక్షల మంది రైతులకు ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు అర్హుల జాబితాను తయారు చేస్తున్నారు.

రెండో విడత ఖాళీల భర్తీకి కసరత్తు



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

ఆలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మోడల్ స్కూల్ హాస్టళ్లు, కేజీబీవీ స్కూళ్లలో రెండో విడత ఖాళీల భర్తీకి విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. 16 మోడల్ స్కూల్ హాస్టల్స్, 26 కేజీబీవీ స్కూళ్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఐదు నెలల క్రితం విద్యాశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. కేజీబీవీ, మోడల్ హాస్టళ్లలో 51 నాన్ టీచింగ్, మోడల్ హాస్టళ్లలో 16 పార్ట్ టైం టీచర్లు, ఆరు వార్డెన్ పోస్టులకు నియామక ప్రక్రియ పూర్తి చేశారు. ఇందులో కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్న వాటిని వదిలి పెట్టి 66 పోస్టులకు గతేడాది నవంబరు 18న నియామకాలు పూర్తిచేశారు. ఇందులో ఐదు హాస్టళ్లకు పార్ట్‌టైం టీచర్లు జాయిన్‌కాలేదు. చాలాచోట్ల నాన్‌టీచింగ్ సిబ్బంది విధుల్లో చేరలేదు. మరి కొంతమంది జాయిన్ అయ్యి వదిలేశారు. ఎక్కడైతే జాయిన్ కాలేదో జాయిన్ అయ్యి వదిలేశారో అలాంటి చోట జాబితాలో తదుపరి అభ్యర్థితో ఆపోస్టును భర్తీచేయాలని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో అధికారులు రెండో జాబితాను సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

నియామకాలు త్వరలో పూర్తి చేస్తాం



జిల్లాలో ఖాళీ ఉన్న చోట మొదటి విడత నియామక జాబితాలో తదుపరి అభ్యర్థులతో భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఉన్నత అధికారుల నుంచి కూడా అనుమతి వచ్చింది. ఔట్ సోర్సింగ్ విధానంలో నియామకాలు పూర్తి చేస్తాం.

- శామ్యూల్‌పాల్, డీఈవో, కర్నూలు

ఆర్‌టీఈతో కార్పొరేట్ విద్య

- నోటిఫికేషన్ జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25శాతం సీట్ల కేటాయింపు
- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఉచితం
- ఈనెల 15న దరఖాస్తుకు చివరి తేదీ
- జిల్లాలో 3,500 మంది పైగా పేద విద్యార్థులకు అవకాశం



ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. విద్యాహక్కు చట్టానికి (ఆర్‌టీఈ) సంబంధించి నోటిఫికేషన్ జారీచేసింది. ఈచట్టం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయించేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళిక సిద్ధంచేసింది. జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో 3,500పైగా పేదవిద్యార్థులు అడ్మిషన్లు పొందనున్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్ యాజమాన్యాలు కోర్టులను ఆశ్రయించి విద్యాహక్కు చట్టం అడ్మిషన్లకు నిరాకరించాయి. ఈసారి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు సమగ్రశిక్ష ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలో దాదాపు 604ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండగా 25శాతం సీట్లు పేద విద్యార్థులకు విద్యాహక్కు చట్టం ద్వారా కేటాయించాల్సి ఉంది. ఈ చట్టం ప్రకారం అడ్మిషనులు పొందే విద్యార్థుల ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుంది.

దరఖాస్తు ఇలా..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్, ఓసీలో విభిన్న ప్రతిభావంతులు, అనాథలు, హెచ్ఐవీ బాధిత తల్లిదండ్రుల పిల్లలు ఆర్‌టీఈ ప్రవేశాలకు అర్హులు. ఆయా వర్గాల విద్యార్థులు తమ సమీపంలోని ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్‌సీ, స్టేట్ సిలబస్ బోధన అందించే ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల ఆధార్, ఇతర ప్రాథమిక వివరాలతో హెచ్‌టీటీపీఎస్//సీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ మే 15 తేదీలోగా రిజిస్టర్ చేసుకోవాలి. అదేవిధంగా సచివాలయాలు, మండల విద్యావనరుల కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులకు లాటరీ ద్వారా సీట్లు కేటాయిస్తారు.

మంచి అవకాశం

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. పేద విద్యార్థులకు ఇది మంచి అవకాశం. కార్పొరేట్ పాఠశాలలో వారు చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. తల్లిదండ్రులు ఈనెల 15 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే 1200మందికి పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి.

- శామ్యూల్ పాల్, డీఈవో, కర్నూలు

సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన నేతలు

కర్నూలు, మే 9 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పర్యటన ముగించిన కర్నూలు విమానాశ్రయానికి వచ్చిన సీఎం నారా చంద్రబాబు నాయుడుకు జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతపురం నుంచి హెలికాప్టర్‌లో ఓర్వకల్లు మండలంలోని విమానాశ్రయానికి వచ్చిన చంద్రబాబుకు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎంపీ, ఎమ్మెల్యేలు నాగరాజు, గౌరు చరిత, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అధికారులు ఘన స్వాగతం పలికారు.



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న టీజీ వెంకటేశ్

సర్వేను త్వరగా పూర్తి చేయండి

డీఎంహెచ్‌వో పి.శాంతికళ


సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శాంతికళ

కర్నూలు హాస్పిటల్, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్‌సీడీ-3.0 సర్వేను త్వరగా పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో పి.శాంతికళ ఆదేశించారు. శుక్రవారం శ్రీరామ్‌నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. డీఎంహెచ్‌వో శాంతికళ మాట్లాడుతూ అసంక్రమిక వ్యాధుల కట్టడిలో భాగంగా సార్వత్రిక ఆరోగ్య పరీక్షల కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఎన్‌సీడీ-3.0 సర్వే వివ రాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడు చేయాలని ఆదేశించారు. స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎం, ఆశాలు కలిపి ఇం టింటి సర్వే నిర్వహించాల న్నారు. ముఖ్యంగా రొమ్ము, సర్వేకల్ క్యాన్సర్, బీపీ, మధుమేహంతో పాటు హీమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమానిత కేసులను ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్‌కు పంపిం చాలని ఆదేశించారు. క్యాన్సర్ కేసులను స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపించాలన్నారు. వారంలో రెండు రోజులు మంగళ, గురువారం క్యాన్సర్ రెఫర్ కేసులు చూస్తారన్నారు. కార్యక్ర మంలో జిల్లా మలేరియా అధికారి ఏనూక రాజు, డిప్యూటీ డెమో చంద్ర శేఖర్ రెడ్డి, ఏఎన్ఎం పి.పద్మావతి, ఆశా కార్యకర్త ఎం.పద్మావతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్య లను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నా రు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ధర్నా చౌకు వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాగరాజు మా ట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణే ఏపీటీఎఫ్ ధ్యేయమని అన్నారు. ప్రభుత్వం విద్యను 9 అంశాల పాఠశాల వ్యవస్థను నెలకొల్పి అయోమ యానికి గురి చేస్తుందన్నారు. ప్రాథమిక పాఠశాలలను బేసిక్ పాఠశా లలో కనీసం ఇద్దరు ఎస్‌జీటీ ఉపాధ్యాయులచే ఏర్పాటు చేయాలని, అక్కడ ఒకటి నుంచి 5 తరగతులు ఉండాలని అన్నారు. అదేవిధంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతిలో ఒక ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు, కనీసం ఐదుగురు ఉపాధ్యాయులతో ఒక ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఉండాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 తరగతులు మాత్రమే కొనసాగాలన్నారు. ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని మైనర్ మీడియా కన్నడ, ఉర్దూ, తమిళ్, ఒరియా మాధ్యమాల్లో బోధన కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎం. రవికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాం ఖలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పాట్ రెమ్యునరేషన్ చెల్లించాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయుల రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి మరియానందం ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో డీఈవో శామ్యూల్‌పాల్‌ను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంవత్సరం స్పాట్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయుల రెమ్యునరేషన్ కూడా నేటి వరకు చెల్లించలేదన్నారు. డీఈవో స్పందిస్తూ ప్రభుత్వం స్పాట్ మొత్తాలు విడుదల చేసిన వెంటనే ఉపాధ్యాయుల ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. డీఈవోను కలిసిన వారిలో జిల్లా కౌన్సిలర్ బీడీఆర్, రాజశేఖర్ ఉన్నారు.

జి.పుల్లారెడ్డి దంత వైద్యశాలలో మౌలిక వసతులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కర్నూలు జి.పుల్లారెడ్డి దంత వైద్యశాలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఉన్నాయని పలువురు వైద్యులు పేర్కొన్నారు. శుక్రవారం జి.పుల్లారెడ్డి దంత వైద్యశాలలో నారాయణమ్మ పుల్లారెడ్డి ఆడిటోరియంలో వైద్యులకు, వైద్యవిద్యార్థులకు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ దంత వైద్యకళాశాలలో మౌలిక సదుపాయాలతో పాటు అపూర్వ అనుభవజ్ఞులైన వైద్యసిబ్బంది, అధ్యాపకులు, అత్యాధునిక వైద్యపరికరాలు ఉన్నాయని తెలిపారు. జి.పుల్లారెడ్డి ట్రస్టు ద్వారా ప్రతిభగల పేద విద్యార్థులకు ప్రతిఏడాది ప్రోత్సాహక పారితోషికాలను అందిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ వైద్యవిద్య విశ్వవిద్యాలయం ఉపకులపతితో పాటు దంత వైద్యశాల ప్రిన్సిపాల్ డి.నాగలక్ష్మిరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ బోధన, బోధనేతర సిబ్బంది, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్లను పరిష్కరించాలి

కర్నూలు కలెక్టరేట్, మే 9(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్లను పరిష్కరించాలని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొత్తూరు సత్యనారాయణ గుప్తా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 16,345 పోస్టులకు ప్రభుత్వం భర్తీ చేయబోతుందన్నారు. 2018 డీఎస్సీ తర్వాత ఒక్క నోటిఫికేషన్ కూడా జారీ చేయలేదని, ఇప్పుడు నోటిఫికేషన్ జారీ చేశారని అన్నారు. 13 జిల్లాలకు 13 ప్రశ్నాపత్రాలు విడుదల చేయాలని, ఓసీ విద్యార్థులకు 50 శాతం క్వాలిఫైని కొత్త నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. ఓపెన్‌లో విద్య అభ్యసించిన విద్యార్థులకు కూడా డీఎస్సీలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఓర్వకల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన బోయ హనుమన్న(58) గురువారం పొలానికి వెళ్తూ కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిని దాటుతుండగా కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్లే కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య కూడా ఇటీవల మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ ఢీకొని.. వ్యక్తికి తీవ్ర గాయాలు

ఓర్వకల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై నన్నూరు బస్ స్టేజీ వద్ద శుక్రవారం మండలంలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన యేసయ్య రోడ్డు దాటుతుండగా.. ద్విచక్ర వాహనం అతివేగంగా ఢీకొనడంతో యేసయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం టోల్‌గేటు వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నన్నూరు హైవేపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఫ్లైఓవర్ నిర్మించాలని ఆందోళనలు చేసినా హైవే అథారిటీ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకుడు నాగన్న ఆరోపించారు.

ప్రొఫెసర్‌ను విధుల నుంచి తొలగించాలి

కర్నూలు అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్‌గా కొనసాగుతున్న ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌ను విధుల నుంచి తొలగించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి డిమాండ్‌చేశారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడును బీసీ సంఘాల నాయకులు నక్కట మిట్ట శ్రీనివాసులు, ఆర్‌పీఎస్ అధ్యక్షుడు సీమ కృష్ణ, రజక సంఘం రాష్ట్ర నాయకులు వేంపెంట రాంబాబు, బీసీ విద్యార్థి సంఘం నాయకులు భరత్ కుమార్ ఆచారి, శేషఫణి కలిశారు. గతంలో రాయలసీమ వర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతిగా ఆయన చేసిన సమయంలో అవినీతి, అక్ర మాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నందివిజయలక్ష్మి, బీవీ రమణ, పెరుగు శివకృష్ణ, ఖదీరుల్లా, నాగభూషణం పాల్గొన్నారు.

టైం స్కేల్‌ను రద్దు చేయాలి

కర్నూలు అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో టైం స్కేల్‌ను రద్దుచేయాలని వర్సిటీ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు నాగారాజు, రామకృష్ణ, నాగార్జున, సందీప్ నాయక్ ఉపకులపతి వెంకట బసవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిపై దాడి చేసి అతనిపైనే కేసు పెట్టిన ఉద్యోగిని సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నారాయణ, రాజేష్, ప్రకాష్, నవీన్, రాఘవ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో కారుణ్య నియామకం

కర్నూలు న్యూసిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తూ గత డిసెంబరు 21, 2023న అనా రోగ్యంతో మరణించిన పి.మాదక్క కుమారుడికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తూ కమిషనర్ ఎస్. రవీంద్ర బాబు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ మాదక్క కుమారుడు పంభ శేఖర్‌కు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, సూపరింటెండెంట్ స్వర్ణలత పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

సి.బెళగల్, మే 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్యాధికారి మిథున్‌కు మార్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుధాకర్, పద్మావతమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వెడల్పునకు సహకరించాలి: జేసీ


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు న్యూసిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): సీసీరోడ్డు వెడల్పునకు భూ యజమానులు మున్సిపల్ అధికారులకు సహక రించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య కోరారు. శుక్రవారం ఉదయం నగర పాలక కౌన్సిల్ సమావేశంలో కార్పొరేషన్ పరిధిలో దామోదరం సంజీవయ్య సర్కిల్ నుంచి శ్రీసాయి గార్డెన్స్ వరకు రోడ్డు వెడల్పులో ప్రభావితమయ్యే భవన, స్థల యజమానులతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం జరిగిన సమా వేశంలో యజమానుల కోరికపై 120 అడుగుల వెడల్పు ఉండాల్సిన రోడ్డును 100 అడుగుల రోడ్డుగా మార్చడానికి ప్రభుత్వాన్ని ఒప్పించామ న్నారు. ఈ క్రమంలో భవన, స్థల యజమానులు వెంటనే తమకు సంబంధించిన డాక్యుమెంట్లను కార్పొరేషన్‌కి అందించాలన్నారు. కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు 90 మంది డాక్యుమెంటు సమర్పించారన్నారు. ఈసమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారి ప్రదీప్ కుమార్, భూ యజమానులు పాల్గొన్నారు.

ధర్మకర్తలకు దరఖాస్తు చేసుకోండి

ఓర్వకల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులోని చెన్నకేశవ, ఆంజనేయ, ఎన్.కొంతలపాడులోని యాగంటీశ్వరస్వామి ఆల యాల ధర్మకర్తలకు దరఖాస్తు చేసుకోవాలని ఈవో చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. విజయవాడ దేవదాయ ధర్మాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు నూతన ధర్మకర్తలుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తులను కర్నూలు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఈ నెల 27వ తేదీ లోపు సమర్పించాలన్నారు.

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

ఓర్వకల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని ఏవో సుధాకర్ శుక్రవారం తెలిపారు. ఏపీ సీడ్స్ గోడౌన్‌లో జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదేశాల మేరకు జీపీఐ కంపెనీ, సిరి పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభిం చారని, వారంలో రెండు రోజులు సిరి పొగాకు కొనుగోలు చేస్తుం దని తెలిపారు. మిగతా రోజుల్లో బీడీ, రస్టికా పొగాకులను కొను గోలు చేస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన

కర్నూలు న్యూసిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరి ధిలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని కోరుతూ చేపట్టిన నిరసన కొనసాగుతోంది. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ కార్మికులు సమస్యల ను పరిష్కరించే వరకు నిరసనలు ఆపే ప్రసక్తి లేదన్నారు. కార్యక్ర మంలో నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుమీర్ బాషా, రవూఫ్ బాషా, రంగ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం: డీఎస్‌డీవో


తైక్వాండో శిక్షణా శిబిరంలో విద్యార్థులు, అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, మే 9(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగునని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. శుక్రవారం నగరంలోని పెద్దపాడు మోడల్ స్కూల్ క్రీడా మైదానంలో తైక్వాండో వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు తైక్వాండో శిక్షణకు హాజరు కావాలన్నారు. మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ, దేహదారుఢ్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో తైక్వాండో క్యాంపు కోచ్ షబ్బీర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా కర్నూలు నగరంలోని నెహ్రూ మెమో రియల్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జరుగుతున్న తైక్వాండో, సెపక్‌తక్రా శిక్షణా శిబిరాలను డీఎస్‌డీవో భూపతిరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస రావులు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, నెహ్రూ పాఠశాల వ్యాయామ ఉపాధ్యా యుడు సుబ్రహ్మణ్యం, కోచ్ వీరేష్, నితిన్ కుమార్ పాల్గొన్నారు.

జవాన్ మృతికి సంతాపం

కర్నూలు న్యూసిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు సంతాపం ప్రకటిస్తున్నట్లు కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ భద్రత కోసం తన ప్రాణాలను అర్పించిన మురళీనాయక్ త్యాగాన్ని దేశం ఎన్నటికీ మరచిపోదన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి: కమిషనర్


మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు వీధి వ్యాపారులు సహకరించాలని కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు కోరారు. శుక్రవారం నగర పాలక కార్యాయలంలో టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ఐడీ కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెంకటరమణ కాలనీ, సి.క్యాంపు, బిర్లా కాంపౌండ్ ప్రాంతాల్లో సుమారు 100 మంది వ్యాపారం చేసుకునే విధంగా స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 12 నుంచి వీధి వ్యాపారుల రీసర్వే ప్రారంభమవుతుందన్నారు. కార్పొరేటర్ పరమేష్, టీపీఆర్‌వో వెంకటలక్ష్మి, ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పూడిక పనులు పకడ్బందీగా చేపట్టాలి

కర్నూలు న్యూసిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని 52 వార్డుల్లో పూడిక పనులు పకడ్బందీగా చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం పెద్దపడఖాన, దండే గేరి తదితర ప్రాంతాలలో పూడిక తీసే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రూ.1.06 కోట్లతో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రతి వార్డులో 15 మందికి పైగా ప్రత్యేక సిబ్బందితో మురుగు కాలువల్లో వ్యర్థాల తొల గింపు పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. అలాగే సుద్దవాగులో తొలి దశ పూడిక తీసే పనులు పూర్తయ్యాయని, కేసీ కెనాల్‌లో కూడా పూడిక తీసే పనులు ప్రారంభించామన్నారు. కార్పొరేటర్ కురువ పరమేష్, డీఈఈ గంగాధర్, ట్రైనీ ఏఈ మహేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జిలానీ ఉన్నారు.

పండ్లతోటల సాగుతో అధిక లాభాలు

సి.బెళగల్, మే 9(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చునని కోడుమూరు ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌గౌడు అన్నారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణ దొడ్డి, మారందొడ్డి గ్రామాల్లోని పండ్లతోటలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవోలు చెంచురాజు, భాస్కర్, రైతులు ఉన్నారు.

ఘనంగా నారసింహుడి ప్రభోత్సవం


ప్రభను లాగుతున్న భక్తులు

కోడుమూరు రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమలగుర్తిలో లక్ష్మీనరసింహ ఈరన్నస్వామి వార్షిక ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామిఅమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చనలు చేపట్టారు. సాయంత్రం ఎద్దులబండిపై నరసింహస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి మేళతాళాల మధ్య ఎదురుమండపం వరకు లాగారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

హడలెత్తించిన కొండ చిలువ


భారీ కొండచిలువ

రుద్రవరం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులు చేస్తుండగా భారీ కొండచిలువ కనిపించడంతో కూలీలు హడలెత్తారు. ఈ ఘటన మండలంలోని చిన్నకంబలూరు గ్రామ సమీ పంలో శుక్రవారం చోటు చేసుకున్నది. వివరాలు .. గ్రామ సమీపంలో ఉపాధి కూలీలు పని చేస్తుండగా 13అడుగుల కొండచిలువ కనిపించింది. దాంతో భయాందోళనకు చెందారు. పనుల వద్ద నుంచి కొండచిలువను పక్కకు తరలించారు. అలాగే పెద్దకంబలూరు గ్రామంలో ఉపాధి పనుల వద్ద పాములు కనిపించాయి. పాములను ఉపాధి కూలీలు చంపేశారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమరోలు గ్రామంలో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా అర్చకులు రామాంజనేయులు శర్మ స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. అంతకుముందు వేంకటేశ్వరస్వామికి ఆమె కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రథాన్ని ఎమ్మెల్యే పూజలు చేసి ముందుకు కదిలించారు. చెక్కభజనలు పలువురిని ఆకట్టుకున్నాయి. భక్తులు రథాన్ని ఊరువాకిలి వరకు లాగి యథాస్థానంలో నిలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రుడు, మాజీ కాల్వబుగ్గ చైర్మన్ చంద్రపెద్ద స్వామి, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఆకుల మహేష్, కాకి దేవేంద్ర, రామమద్దిలేటి, నాగమల్లేష్, సంజీవ, ప్రతాప్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయంఉపాధి కోసం బ్యాంకు లింక్‌డ్ రుణాల కోసం నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేసిందని, లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి గడువును పొడిగించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నగర అధ్యక్షులు నాగరాజు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసిదేవికి వారు వినతిపత్రం అందజేశారు. మే 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉండగా.. మూడు రోజుల నుంచి సర్వర్ పని చేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

గిట్టుబాటు ధర కల్పిస్తాం


రైతు మార్కెట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

గూడూరు, మే 9(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన కూరగాయలకు విష్ణు సేన రైతు మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పిస్తామని విష్ణు సేన రైతు మార్కెట్ నిర్వాహకుడు బి.పౌలు అన్నారు. శుక్రవారం గూడూ రులోని కూరగాయల మార్కెట్‌లో విష్ణు సేన క్రయ విక్రయాల రైతు మార్కెట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా పౌలు మాట్లాడుతూ కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సహకారంతో గూడూరులో విష్ణు సేన రైతు మార్కెట్‌ను ప్రారంభించామన్నారు. గూడూరు, సి.బెళగల్ మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధరను విష్ణు సేన రైతు మార్కెట్‌లో కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్, మహేశ్వర రెడ్డి, కౌన్సిలర్ కలాంబాషా, బుడ్డంగలి, తెలుగు శ్రీను, వాహిద్, కూరగాయల ఆదాం, విజయ్ కుమార్, పవన్ పాల్గొన్నారు.

రేపు బుద్ధుని విగ్రహ ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్, మే 9(ఆంధ్రజ్యోతి): ది కర్నూలు స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో కర్నూలు బుద్ధా పిరమిడ్ ధ్యాన కేంద్రంలో పిరమిడ్ బ్రహ్మరిషి డాక్టర్ బీవీ రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన బుద్ధుని విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు సొసైటీ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రాఘవేంద్రనగర్‌లోగల బుద్ధా పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, ముఖ్య అతిథులుగా కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హాజరవుతారని తెలిపారు.

మద్యం షాపులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మద్యం షాపులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉదయం నుంచి రాత్రి 11 రాత్రి గంటల వరకు మద్యం విక్రయాలు చేస్తున్నారని, చిన్న పిల్లలకు కూడా మద్యం విక్రయిస్తున్నారని, ఆ షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీల అభ్యున్నతి మోదీతోనే సాధ్యం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 9(ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీఎస్ నాగరాజు యాదవ్, శ్రీరాములు యాదవ్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక చెక్‌పోస్టు సమీపంలో బీజేపీ బీసీ సంఘాల ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కులాలు ఎంతో కాలంగా కులగణన కోసం ఎదురు చూస్తున్నాయని, ప్రజల కాంక్ష మేరకు కేంద్ర కేబినెట్ కులగణన చేపట్టాలని చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుందన్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సాయిప్రదీప్, కుర్ని వెంకటేష్, డాక్టర్ నాగేంద్ర, రామ్మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టిడ్కో గృహాలకు బస్సు సౌకర్యం కల్పించండి

కర్నూలు రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారులో ఉన్న టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో కర్నూలు-1 డిపో మేనేజర్ సుధారాణికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నాయకులు మహేష్, కుమార్, బాబయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. టిడ్కో గృహాల వైపు ఆర్టీసీ బస్సులు తిరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

డీజేలకు అనుమతి లేదు: ఎస్ఐ

కోడుమూరు రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): పెళ్లిళ్లకు డీజేలకు అనుమతి లేదని ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల పెళ్లిళ్లకు అర్ధరాత్రి దాటే వరకు డీజేలను వినియోగిస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనికి తోడు పెద్దశబ్దంతో డీజేలను వినియోగిస్తూ శబ్ద కాలుష్యానికి పాల్పడు తున్నారని, ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం తగదని అన్నారు.

కిశోర బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



ఆదోనిలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మద్దికెర, మే 9 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారిని రాగిణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో కిశోరి వికాసం వేసవి సెలవులపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ యుక్త వయసులో ప్రవేశించిన బాలికల స్వేచ్ఛను భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, ఏఎన్ఎం గాయత్రీ తదితరులు ఉన్నారు.

వెల్దుర్తి: స్థానిక సచివాలయం-3లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహం, పునరుత్పత్తి ఆరోగ్యం-ప్రభావాలు గురించి అవగాహన కల్పించారు. సీడీపీవో లూక్ మాట్లాడుతూ తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేయరాదన్నారు. 18 సంవత్సరాలు పూర్తయిన తరువాతనే వివాహ ప్రయత్నాలు చేయాలన్నారు. బాల్యవివాహాల చేసే వారి సమాచారం 100 లేదా 1098 నెంబర్లకు తెలియజేయాలన్నారు.

ఆదోని టౌన్: ఆచారాల పేరుతో బాలికలకు చిన్న వయసులోనే వివాహాలు చేయడంతో వారి జీవితాలలో అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని డాక్టర్ పృథ్వీరాజ్ అన్నారు. కల్లుబావిలోని అంగన్వాడీ సెంటర్‌లో సూపర్వైజర్ సావిత్రి ఆధ్వర్యంలో శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సులో ఎంఎస్‌కె అంజలి, ఏయన్ఎం అనసూయ, కార్యకర్తలు సరోజ, గీత, రేషన్ బి, కనకవలి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవోగా శివకుమార్



మద్దికెర, మే 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న శివకుమార్‌ను ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవోగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా పని చేస్తున్న మద్దిలేటి స్వామి ఆలూరు ఎంపీడీవోగా పదోన్నతి లభించి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా శివకుమార్‌ను నియమించారు.

'అన్నదాత సుఖీభవ'కి దరఖాస్తు చేసుకోవాలి

మద్దికెర, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధి పొందేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి రవి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్‌బీకే కేంద్రంలో రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.20వేలు అందిస్తుందన్నారు. పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.14వేలుతో కలిపి మొత్తం రూ.20వేలు మూడు దఫాలుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. రైతులు తమ ఖాతాలను సక్రమంగా ఉన్నాయా లేదా అని చూసుకోవాలన్నారు. 20వ తేదీలోపు రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయసిబ్బంది జాకీర్, ఆనంద్, రాణి, కవిత ఉన్నారు.

సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి

మద్దికెర, మే 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలో విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠాలను అర్థం చేసుకుని అందరూ ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో రంగస్వామి తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని జిల్లా పరిషత్, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలో మొత్తం 60 మంది విద్యార్థులు ఫెయిలయ్యారని అన్నారు. వారందరికీ ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న రూరల్ సీఐ పులిశేఖర్

తుగ్గలి, మే 9 (ఆంధ్ర జ్యోతి): పాకిస్తాన్ చేస్తున్న వికృత చేష్టలకు భారత సైనికులు బుద్ధి చెబుతున్నారని, ప్రజలు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి సైన్యానికి తోడుగా నిలవాలని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ అన్నారు. శుక్రవారం తుగ్గలిలో ఆయన మాట్లాడుతూ దేశంలో యుద్ధ వాతావరణం మొదలైందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి దేశ సైనికులకు అండగా నిలవాలని కోరారు. అపరిచితులు ఎవరైనా గ్రామాల్లో పర్యటిస్తుంటే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈయన వెంటన తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు కృష్ణమూర్తి, మల్లికార్జునలు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ఆలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఆస్పరి, హొళగుంద మండలాలకు చెందిన చిన్నఅంజని, వడ్ల నాగేశ్వరమ్మలకు రూ.168444ల చెక్కులను అందించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, జనసేన ఐటీ కో ఆర్డినేటర్ రంజిత్, టీడీపీ నాయకులు అశోక్, నరసప్ప, సతీష్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి



ఎద్దుల దొడ్డిలో ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న నాయకులు

తుగ్గలి, మే 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీరసూల్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ పని దినాల్లో 200 రోజులు పెంచాలని, రోజు వారి వేతనం రూ.700లు ఇవ్వాలన్నారు. కూలీలకు పనుల వద్ద మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈయన వెంట రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి నాగరాజు, అన్వేష్, రామానాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ రవికుమార్, మల్లన్న తదితరులు ఉన్నారు.

14వ తేదీ సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి, మే 9(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 14న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుహాసినమ్మ శుక్రవారం తెలిపారు. మండలంలో ఉన్న మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని ఆదేశించారు. గడచిన మూడు నెలల కాలంలో చేపట్టిన అభివృద్ధి, భవిష్యత్తులో చేపట్టే పనుల గురించి అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశంలో చర్చించనున్నామని తెలిపారు.

కన్నీటి కష్టాలు

తుగ్గలి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి.. భూగర్భజలాలు అడుగంటాయి. గ్రామాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం చెబుతున్నా ఆదిశగా వారు చర్యలు చేపట్టిన దాఖాలు లేవు. దీంతో గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల దూరం పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుగ్గలి మండలంలో తాగునీటి సమస్య దారుణంగా ఉంది.

- బిందె నీటి కోసమే బండెడు కష్టం
- పట్టించుకోని అధికారులు
- వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీస్తున్న ప్రజలు



మారెళ్లలో ద్విచక్రవాహనాలతో నీటిని తెచ్చుకుంటున్న ప్రజలు



● మారెళ్లలో దాదాపు 5వేల మంది జనాభా నివసిస్తున్నారు. వారి దాహార్తిని తీర్చేందు కోసం గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకుతో పాటు మినీ ట్యాంకులు ఏర్పాటుచేసి బోర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే.. బోర్లను మరమ్మతులు చేయకపోవడంతో ఆరు రోజుల నుంచి గ్రామంలో చుక్కనీరు రావడం లేదు. గ్రామ శివారులో ఉన్న హౌసింగ్ కాలనీల ఉన్న బోర్ల వద్దకు, వ్యవసాయ తోటల వద్దకు ఎద్దుల బండ్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇది ఏమీ లేని ప్రజలు బిందెలతో నీటిని తెచ్చుకుని గొంతులను తడుపుకుంటున్నారు. ఆరు రోజుల నుంచి రేయింబవళ్లు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్లను మరమ్మతులు చేసి దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



గ్రామంలో బోర్లు మరమ్మతులు చేయాలని పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదు. నీటి కోసం నానా అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి నీటి సమస్య తీర్చాలి.

\- మునిస్వామి, మారెళ్ల

ద్విచక్రవాహనంపై నీటిని తెచ్చుకుంటున్నా



తాగునీరు కొళాయిలకు రాకపోవడంతో గ్రామ శివారులోకి 2 కిలోమీటర్లకు వెళ్లి ద్విచక్రవాహనంపై ప్రతిసారి 5 బిందెల చొప్పున రోజుకు ఐదారు సార్లు తెచ్చుకుంటున్నాం. దీంతో రూ. 100 ఖర్చు అవుతోంది. అధికారులు నీటి సమస్య పరిష్కరించాలి.

\- జయన్న, మారెళ్ల

జగన్ మెప్పు కోసమే ఎమ్మెల్యే ఆరోపణలు

- గల్లీలో కాదు అసెంబ్లీలో మాట్లాడు
- విద్యుత్ చార్జీలు 9 సార్లు పెంచిన ఘనత జగన్‌దే
- ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్



మాట్లాడుతున్న ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, మే9 (ఆంధ్రజ్యోతి): జగన్ మెప్పు కోసమే ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం మానుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే విరూపాక్షికి లేదని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ మండిపడ్డారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆరోపిస్తున్నట్లు ఢణాపురం-హొళగుంద రోడ్డు టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేస్తే గత వైసీపీ ప్రభుత్వంలో టెండర్ రద్దు అయ్యిందన్నారు. మీ ప్రభుత్వంలో రోడ్డు దుస్థితి మీకు కనిపించలేదా అని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వంలో డోన్ నియోజకవర్గ అభివృద్ధి చెందితే ఆలూరు నియోజకవర్గాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. త్వరలో రూ.14 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. నియోజకవర్గంలో 9 నెలల వ్యవధిలో రూ.18 కోట్లతో రోడ్లు వేశామని, రూ.2 కోట్ల 23 లక్షలు రోడ్లకు ప్యాచ్ వేశామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. వైసీపీ ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించే విధంగా కత్తులు, బాంబులు ఉన్నాయని చెప్పుకోవడం చూస్తే ఆయన వ్యక్తిత్వం ఏమిటో బయట పడుతుందన్నారు. ఇక నుంచి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. సమావేశంలో ఆలూరు బ్రాంచ్ కెనాల్ అధ్యక్షులు కిష్టప్ప, టీడీపీ నాయకులు రామ్‌నాథ్‌యాదవ్, రఘుప్రసాద్‌రెడ్డి, అశోక్‌యాదవ్, రవి, అట్టేకల్ బాబు, తిమ్మయ్య, నరసప్ప, కొమ్ము రామాంజనేయులు, కృష్ణనాయుడు, ముద్దురంగ, గూళ్యం రామాంజనేయులు, మసాల జగన్, రాము, కిట్టు పాల్గొన్నారు.

ఆర్‌డీటీ సెట్ రద్దు అన్యాయం

ఆదోని అగ్రికల్చర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించేందుకు నిర్వహించే ఆర్‌డీటీ ప్రవేశ పరీక్ష రద్దు చేయడం అన్యాయమని ఎస్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ గౌడ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించడంతో ఆర్‌డీటీ సెట్ రద్దయిందని ఆరోపించారు. విదేశీ సహాయ చట్టం రెన్యువల్‌ను నిరోధించి సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అడ్డుకోవడం మంచిదికాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద, విద్యార్థులకు విద్య, పండ్లతోటల అభివృద్ధి, దళిత, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల వారికి విద్యా, వైద్య సేవలు అందిస్తూ ఆర్‌డీటీ కృషి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి వెంటనే సేవలు పునరుద్ధరించేలా చూడాలనికోరారు.

పెసలబండలో కబడ్డీ పోటీలు



మొదటి బహుమతి గెలుపొందిన పెసలబండ జట్టు

ఆదోని అగ్రికల్చర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెసలబండ గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి జాతరను పురస్కరించుకొని నిర్వహించిన కబడ్డీ పోటీల్లో పెసలబండ జట్టు మొదటి బహుమతి కైవసం చేసుకుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి అమర్ ప్రకాష్ తెలిపారు. ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొన్నాయి. ఏఆర్ జట్టు ద్వితీయ స్థానం, ఆదోని ఫిలిప్స్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయన్నారు. నిర్వాహకులు విజేతలైన జట్టుకు నగదు బహుమతితో పాటు మెమొంటోను అందజేసినట్లు తెలిపారు.

ఉగ్రవాదుల స్థావరాలపై ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ హర్షణీయం

ఆలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాదులపై ఇండియన్ ఆర్మీ చేసిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం హర్షణీయమని మాజీ సైనికులు అన్నారు. శుక్రవారం ఆలూరులో మాజీ సైనికులు జై జవాన్, భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. మాజీ సైనికులు శివప్రసాద్, మహేష్ మాట్లాడుతూ పాకిస్తాన్‌కు ముచ్చెమటలు పట్టించిన ఇండియన్ ఆర్మీకి అభినందనలు తెలిపారు. ఆర్మీ చేసిన ఈ ఆపరేషన్ వల్ల భారతీయులకు ధైర్యం కలిగిందని, మృతిచెందిన భారత్ సైనికుల ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థించారు.

నిలిచిపోయిన రక్త పరీక్షలు



వైద్యశాలలోని రక్త పరీక్షల గది

దేవనకొండ, మే 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వైద్యశాలలో రక్త పరీక్షల నిర్వాహకుడు(ల్యాబ్ టెక్నిషియన్) లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 86 జనాభాకు దేవనకొండ ప్రాథమిక వైద్యశాలలోనే రక్త పరీక్షలు చేసేది. గత ఏడాదిగా ల్యాబ్‌టెక్నిషియన్ లేకపోవడంతో, పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ ప్రాథమిక వైద్యశాలలో పని చేస్తున్న ల్యాబ్ టెక్నిషియన్‌ను వారంలో మూడు రోజులు విధులను నిర్వహించేలా నియమించారు. అనివార్య కారణాలతో ఆయన కూడా సెలవు పెడితే రక్త పరీక్షల కోసం ప్రజలు బయట ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళాల్సివస్తుంది.

రీ సర్వే పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, తహసీల్దార్

ఆదోని రూరల్, వే 9 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం కడితోట గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పరిశీలించారు. శుక్రవారం తహసీల్దార్ శివరాముడు డివిజన్ సర్వేయర్ వేణుగోపాల్‌తో కలిసి సబ్ కలెక్టర్ ఆకస్మికంగా రీసర్వే పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కడితోటలో సర్వే పనులు పూర్తయ్యాయని, అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావచ్చని, రైతులకు సూచించామని తహసీల్దార్ సబ్‌కలెక్టర్ తెలిపారు. త్వరితగతిన పారదర్శకంగా పనులు చేయాలని సబ్ కలెక్టర్ తెలిపారు.

తాగునీటి పరిష్కారానికి పాదయాత్ర

ఆదోని రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి లింగన్న తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర కష్టాలు పడుతున్నారన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 11, 12, 13వ తేదీల్లో పాదయాత్ర చేస్తున్నామన్నారు. ముందుగా పెద్దతుంబళం నుంచి ప్రారంభమై 14న ఆదోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి చేరుకుంటుందన్నారు.

ముగిసిన బండలాగుడు పోటీలు

వెల్దుర్తి, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలో లక్ష్మీనగరం గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి జాతర పురస్కరించుకొని నిర్వహించిన బండలాగుడు పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల్లో కర్నూలు రూరల్ బీ.తాండ్రపాడు గ్రామానికి చెందిన వరలక్ష్మీ వృషభాలు మొదటి బహుమతి రూ.40వేలు, జోగులాంబ గద్వాల జిల్లా కంచుపాడు గ్రామానికి చెందిన వడ్డెమాను అంజనేయరెడ్డి వృషభాలు రెండో బహుమతి రూ.30వేలు, కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన శశాంక్ శ్రేయ వృషభాలు మూడో బహుమతి రూ.20వేలు, ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహ వృషభాలు నాల్గవ బహుమతి రూ.10వేలు గెలుచుకున్నాయి.

వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

ఆదోని, మే 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీ వివేకానంద స్కూల్ వద్ద వరిగడ్డితో వెళ్తున్న ట్రాక్టర్‌కు షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం దగ్ధమైంది. మల్లికార్జున వ్యక్తి పశువుల కోసం ట్రాక్టర్‌పై వరిగడ్డిని ఎన్‌జీవోస్ కాలనీ నుంచి గడ్డివాము తీసుకెళ్తుండగా విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న ఇంటికి మంటలు వ్యాప్తి చెందడంతో పైకప్పు దెబ్బతిన్నది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

తారు రోడ్డు వేశారు..!



తారు రోడ్డు వేస్తున్న దృశ్యం

మద్దికెర, మే 9 (ఆంధ్రజ్యోతి): మద్దికెర నుంచి బురుజుల మీదుగా పత్తికొండకు అడుగడుగున గుంతలే. ఈ రోడ్డుపై ఎన్నో ప్రమాదాలు జరిగి.. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. మరి కొంత మంది గాయాలపాలయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చాక నిధులు మంజూరు కావడంతో తారురోడ్డు వేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం స్థానిక సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం నుంచి ఆర్‌అండ్‌బీ డీఈ శివరుద్ర ఆధ్వర్యంలో తారురోడ్డు పనులు చేపట్టారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు ప్రజలు, ప్రయాణికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ఠ



స్వామివారి దర్శనానికి వెళ్తున్న మహిళలు

పత్తికొండ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హోసూరు గ్రామంలో శుక్రవారం వేణుగోపాలస్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామంలో రూ.కోటిన్నరతో నూతనంగా నిర్మించిన వేణుగోపాల స్వామి దేవాలయంలో మూడు రోజులుగా వేద పండితులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 6 నుంచి వివిధ పూజా కార్యక్రమాలు, సుప్రభాత సేవ, బెల్డోన రామనాథ శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న మల్లికార్జున

ఆదోని అగ్రికల్చర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి మని, పీడీఎస్యు జిల్లా అధ్యక్షుడు అఖండ రైతు కూలీ సంఘం నాయకులు నారాయణ కుమార్ పాల్గొన్నారు.

ఆలూరు: లేబర్ కోడ్‌లు రద్దుచేసి అంగన్‌వాడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి అఖిల భారత కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న తలపెట్టిన సమ్మెకు సహకరించాలని సీఐటీయూ నాయకులు నారాయణస్వామి కోరారు. శుక్రవారం స్థానిక సీడీపీఓ కార్యాలయంలో సూపర్‌వైజర్ పద్మావతికి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ సమ్మెలో రాష్ట్రంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్స్ అందరూ పాల్గొనాలని కోరారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఐసీడీఎస్ బడ్జెట్ పెంచి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. గ్రాట్యూటీ జీవో నంబర్ 8ని మార్పు చేసి పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేసి మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా మారుస్తూ జీవో ఇచ్చి వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జయశ్రీ, భారతి, ఫరీదాబి, కమల, మాణిక్యమ్మ, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు

ఆదోని అగ్రికల్చర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : అప్‌గ్రేడైన పురపాలక ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయ పోస్టులను కేటాయించి భర్తీ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సీ నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు కోరారు. శుక్రవారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని పురపాలక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కనుగుణంగా ఉపాధ్యాయ పోస్టుల ను భర్తీ చేయాలన్నారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు లోక్యానాయక్, వీరచంద్ర యాదవ్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవి, భీమరాజు, రాజా సతీష్, గంగా నాయక్ పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అణచి వేయాలి

ఆదోని టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేస్తేనే ప్రపంచశాంతి నెలకొంటుందని ఏపీ సీడీ డెలిగేట్ దేవిశెట్టి ప్రకాష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై ఎంతో సాహసోపేతంగా దాడులు కొనసాగిస్తున్న ప్రధాన మోదీని ఆయన ప్రశంసించారు. ఉగ్రవాదులను అంతం చేస్తూ ఎంతో చాకచక్యంగా సాగుతున్న ఇద్దరు ఆర్మీ మహిళా అధికారులను అభినందించారు.

ఆలూరు ఎంపీడీవోగా మద్దిలేటిస్వామి

ఆలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ఎంపీడీవోగా మద్దిలేటిస్వామి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మద్దికెర ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా ఉన్న మద్దిలేటిస్వామి పదోన్నతిపై ఎంపీడీవోగా నియామకమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేసి సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చూస్తామన్నారు. తాగునీటి సమస్యపై దృష్టి సారిస్తామన్నారు. అనంతరం టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

వ్యక్తి అరెస్టు

ఆదోని రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన బోయ బొజ్జప్పను ఇస్పీ పోలీసులు అరెస్టు చేశారు. కర్ణాటక మద్యంను విక్రయిస్తున్న అతడ్ని శుక్రవారం అదుపులోకి తీసుకొని 100 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్.ఐ నాయక్ తెలిపారు.

ఇదేం ట్రాఫిక్ బాబోయ్..

● ఇరుకు రహదారితో వాహనాల రాకపోకలకు అంతరాయం
● రోడ్ల పైనే వ్యాపారాలు, ఆటోల పార్కింగ్
● ఇబ్బందుల్లో ప్రయాణికులు
● పట్టించుకోని అధికారులు

గోనెగండ్ల, మే 9(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు సమస్యగా మారి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డు ఇరుకుగా ఉండటం దీనికి తోడు ఇరువైపుల దుకాణాల ఏర్పాటుతో వాహనాల రాక పోకలకు ఇబ్బందిగా మారింది. పెరుగుతున్న వాహనాల రద్దీకి తగ్గట్టుగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో సమస్య మరింత జటిలమవుతోంది. బస్టాండ్ ప్రాంగణంలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయడం, రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహించడం వల్ల ప్రతి రోజూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

28 గ్రామాలకు కేంద్రంగా..

కర్నూలు, మంత్రాలయం, బళ్లారి, ఆదోని హైదరాబాద్, తిరుపతి, ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల రాకపోకలతో ఈరోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. చుట్టుపక్కల 28 గ్రామాలకు చెందిన ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే గోనెగండ్ల బస్టాండ్ నుంచే వెళ్లాలి. ఈ గ్రామాల్లో బస్టాండ్ ఉన్నా లేనట్టే.. ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రోడ్డు పైనే నిలబడాల్సి వస్తోంది.

నిత్యం వాహనాల రద్దీ

ఈ గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సులు, ట్రాక్టర్‌లు, ఇసుకను తరలించే వాహనాలు, ఇతర ప్రైవేట్ వాహనాలు, నిత్యం తిరుగుతుంటాయి. దీనికి తోడుగా వందలాది ఆటోలు ఇబ్బడి ముబ్బడిగా తిరుగుతుంటాయి. ఎక్కువ సంఖ్యలో వాహనాలు తిరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. కోడుమూరు, ఎమ్మిగనూరు ప్రాంతాలకు వెళ్లే ఆటోలను రోడ్ల పైనే పార్కింగ్ చేస్తుండటంతో మరింత ఇబ్బందిగా మారింది. దుకాణాల దగ్గర వాహనాలను ఉంచడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగింది.

రోడ్లను ఆక్రమించి అద్దెలకు :

మండల కేంద్రంలో అనేక చోట్ల రోడ్లపైనే వ్యాపారాలు చేస్తున్నారు.



ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఎమ్మిగనూరు, కర్నూలు, తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారిలో ఉన్న షాపు యజమానులు తమ షాపులతో పాటు ముందు ఉన్న ఆర్అండ్‌బీ స్థలాలను ఆక్రమించి చిరు వ్యాపారులకు అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. గోనెగండ్ల లోని ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న స్థలాన్ని అద్దెలకు ఇవ్వడంతో రోడ్డు ఇరుకుగా మారిపోయి, వాహనాల రాక పోకలకు ఇబ్బందిగా మారింది. ఏ సమయంలో ఏవాహనం వెనక నుంచి వచ్చి ఢీ కొడుతుందో తెలియక వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాంద్ టాకీస్ క్రాస్‌రోడ్డు, ఆసుపత్రి క్రాస్‌రోడ్డు, గంజహళ్లి క్రాస్ రోడ్డు దగ్గర ఏ వైపు నుంచి ఏ వాహనం ఎప్పుడు దూసుకువచ్చి ఢీ కొడుతుందో అనే భయం వాహనదారులను వెంటాడుతోంది. ఈ కూడళ్లలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటలను కూడా చాల ఉన్నాయి. పెద్ద వాహనాలు వస్తే ట్రాఫిక్ సమస్య ఇంకా ఎక్కువ అవుతోంది. వాహనాలు ఎక్కడివి అక్కడే నిలిచిపోతున్నాయి. ఒక్కోసారి అంబులెన్స్‌లకు కూడ దారి ఇవ్వని పరిస్థితి ఉంటోంది. సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించాలని ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.

వ్యాపారులతో ఇబ్బందిగా ఉంటుంది



వ్యాపారాలు చేసుకునేవారు ఆర్అండ్‌బీ స్థలాన్ని వదిలి వ్యాపారం చేసుకోవాలి. రోడ్డు స్థలంలో వ్యాపారాలు చేస్తుండడంతో రోడ్డు మీద వెళ్లే వాహనాల రాక పోకలకు తీవ్రమైన అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు ఈ విషయంపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలి.

-నాయక్ షాషావలి, గోనెగండ్ల

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



అధికారులు చొరవ తీసుకొని గోనెగండ్లలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను వెంటనే పరిష్కరించాలి. గ్రామాలకు పట్టణాలకు వెళ్లే ఆటోల వల్ల సమస్యలు రాకుండా చూడాలి. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించేవిధంగా చర్యలు తీసుకోవాలి.

-చెన్నలరాయుడు, గోనెగండ్ల

ఖాదర్ లింగస్వామి ఉరుసు ప్రారంభం



విద్యుద్దీపాలతో అలంకరించిన దర్గా

కౌతాళం, మే 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కౌతాళంలో హిందూ, ముస్లిం అన్న తేడాలేకుండా మతసామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో శుక్రవారం నుంచి స్వామి వారి ఉరుసును దర్గా ధర్మకర్త పెద్ద మున్నా పాషా చిస్తి చేతుల మీదుగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్గా ధర్మకర్త మాట్లాడుతూ స్వామి వారి ఉరుసు ఉత్సవాలు 5 రోజుల పాటు కొనసాగుతాయని ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామి వారి సమాధికి గుసూల్ (సుగంధ ద్రవ్యాలతో శుభ్రపరచడం) కార్యక్రమం, శనివారం గంధం, ఆదివారం ఉరుసు, సోమవారం జియారత్ కార్యక్రమం, మంగళవారం సప్రా కార్యక్రమంతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి స్వామి వారి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని తెలిపారు. ఇప్పటికే దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు.

రథోత్సవాన్ని విజయవంతం చేయండి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో సాయికుమార్, టీడీపీ నాయకులు

కోసిగి, మే 9 (ఆంధ్రజ్యోతి): కోసిగి ప్రజల ఆరాధ్య దైవమైన కోసిగయ్య స్వామి (ఆంజనేయస్వామి) రథోత్సవానికి కోసిగి ప్రజలతో పాటు మండల ప్రజలు, నాయకులు విజయవంతం చేయాలని ఆలయ ఈవో సాయికుమార్ తెలిపారు. శుక్రవారం కోసిగయ్య రథోత్సవం జరిగే తేరుబజారు మైదానంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. తేరుబజారు మైదానంలో గుంతలు లేకుండా గరుసుతో రోడ్డును ట్రాక్టర్ల ద్వారా చదును చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శనివారం నుంచి సీతారాముల కల్యాణ నిశ్చయ తాంబూలం పూజలు నిర్వహిస్తామన్నారు. సోమవారం వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్వామివారి రథోత్సవం అశేష భక్తజన వాహిని మధ్య నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీరాములు, విష్ణు, టీడీపీ నాయకులు చిన్న తాయన్న, అయ్యన్న, ఈరయ్య, హనుమంతు, గుండాల ఈరయ్య లక్ష్మిరెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు గురించి తెలుసుకొని మాట్లాడాలి



మాట్లాడుతున్న టీడీపీ చేనేత విభాగం నాయకులు

ఎమ్మిగనూరు, మే 9(ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పార్కు గురించి తెలుసుకొని వైసీపీ నాయకులు మాట్లాడాలని టీడీపీ చేనేత విభాగం నాయకులు మిన్నప్ప, బుడిగే నాగరాజు, మహేష్, దామ నరసింహులు, దేవేంద్ర, కామర్తి మహేష్, కౌన్సిలర్ స్వాతి, టౌన్‌బ్యాంకు వైస్‌ఛైర్మన్ నరసప్ప అన్నారు. శుక్రవారం పట్టణంలోని కెమిస్టి భవన్‌లో వారు మాట్లాడుతూ చేనేత పార్కు గురించి ఎం తెలుసని వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారో.. అర్థం కావడం లేదన్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయడంతో వైసీపీ నాయకులకు నిద్రపట్టడం లేదన్నారు. చేనేతల గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదన్నారు. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు అయితే చేనేతలతో పాటు ఇతరులకు ఏ మేరకు ఉపాధి లబిస్తుందో తెలుసుకోవాలన్నారు. టెక్స్‌టైల్ పార్కులో మౌలిక వసతులతో పాటు ఆధునిక యంత్రాలు, శుద్ధి కేంద్రాలు, గిడ్డంగులు, రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. చేనేత వస్త్రాల ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీ పెరగటానికి మెగా టెక్స్ టైల్ పార్కు ఒక వేదిక అవుతుందన్నారు. టెక్స్ టైల్ పార్కులో ట్రైనింగ్ సెంటర్లు ఉండటం వల్ల చేనేత కార్మికులు నూతన యంత్రాలపై శిక్షణ పొంది ఉత్పత్తి నాణ్యత పెంచుకోవచ్చన్నారు. చేనేత వస్త్రాల ఉత్పత్తి తరువాత ప్యాకింగ్, నిల్వ, రవాణా వంటి పనుల్లో స్థానిక కార్మికులకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా చేనేత కార్మికులు సొంతంగా సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ విషయాలను వైసీపీ నాయ కులు తెలుసుకోకుండా బుదర చల్లే ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చేనేతలసంక్షేమం కోసం పాటు పడే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సు ఢీకొని ఎద్దుల మృతి

● రైతుకు గాయాలు



మృతి చెందిన ఎద్దులు

ఎమ్మిగనూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధి లోని రాళ్లదొడ్డి గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం ఎద్దుల బండిని వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు బస్సు ఢీకొట్టడంతో రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందగా, రైతుకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గొల్ల ఆంజనేయులు ఇంటి నుంచి ఎద్దులబండిని పొలానికి తొలుకు వెళ్తుండగా గ్రామసమీపంలో వెనుకనుంచి వస్తున్న ప్రైవేటు బస్సు వేగంగా ఢీకొట్టింది. దీంతో ఎద్దుల బండి చెల్లా చెదురుగా పడిపోగా రెండు ఎద్దులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెం దాయి. అలాగే రైతు గొల్ల ఆంజేయులుకు తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం కర్నూలుకు తరలించారు. రూరల్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రాలయంలో ట్యాంకు కూలడంపై విచారణ

● బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
● ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ హరేరామ నాయక్



కూలిన ట్యాంకు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ హరేరామ నాయక్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు

మంత్రాలయం, మే 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ఓవర్ హెడ్ ట్యాంకు కూలడంతో విచారణ చేపట్టారు. బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకుని వంద శాతం నిధులను రికవరీ చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ హరేరామనాయక్ అన్నారు. నాబార్డు నిధులు రూ.9.80 కోట్లతో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు, మైక్రో ఫిల్టర్స్, సంపు పనులను నెల్లూరు చెందిన జీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రూ.25 లక్షలతో 2017లో 60వేల లీటర్ల నీటి సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు. రెండు రోజుల కిందట ఈ ట్యాంకు కూలడంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూలిన ప్రదేశాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశం చడంతో చీఫ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు చెందిన జీపీఆర్ కన్‌స్ట్రక్షన్ బిల్లు మంజూరు కాలేదని, ప్రస్తుతం కోర్టులో ఉందని, అప్పుడు పని చేసిన ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, సీఈ, ఏఈఈలు పర్యవేక్షణపై ఆరా తీస్తామన్నారు. శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి నివేదిక రాగానే సంబంధిత కాంట్రాక్టరును బ్లాక్‌లిస్టులో పెట్టడం, అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, డీఈ మోయినుద్దీన్, డీఈఈ సాంబయ్య, ఏఈఈలు వెంకట్రాముడు, నాగమల్లయ్య, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, విజయవాడ క్వాలిటీ కంట్రోల్ డీఈ సత్యనారాయణ, కుమార్ రెడ్డి, ఏఈఈలు సందీప్, రామన్, శ్రీధర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి ఇస్రత్ బాషా, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు శివకృష్ణ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేకపోవడంతో నీటి ట్యాంకు కూలింది : సీపీఎం

మంత్రాలయం రాఘవేంద్రపురంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం నాసిరకంగా నిర్మించడం వల్లే కూలిందని ఆరోపించారు. అధికారులు, కాంట్రాక్టర్లు కాసులకు కక్కుర్తి పడి నాణ్యత ప్రమాణాలు గాలికొదిలేసి ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జయరాజు, వెంకటేశ్వర్లు, తిక్కన్న, హనుమంతు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిన్న భోంపల్లిలో దాహం.. దాహం..



ట్యాంకు వద్ద బిందెలను క్యూలో పెట్టిన దృశ్యం

● తాగునీటి కోసం ప్రజల అవస్థలు
● పట్టించుకోని పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

కోసిగి, మే 9 (ఆంధ్రజ్యోతి): అసలే వేసవి కాలం, ఉష్ణోగ్రతలు నలభై డిగ్రీలకు మించి నమోదు అవుతుండటంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని చిన్నభోంపల్లి గ్రామంలో తాగునీటి కోసం గ్రామ ప్రజలు నీటి ట్యాంకుల వద్ద తోపుడు బండ్లు, ఎడ్లబండ్లు పెట్టుకుని పడిగాపులు కాస్తున్నారు. పదిహేను రోజుల నుంచి గ్రామంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఏర్పడినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎవరూ కూడా గ్రామం వైపు చూడడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చిన్నభోంపల్లి గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామిదేవాలయం పక్కనే ఉన్న తాగునీటి గుమ్మి వద్ద నీరు రాకపోవడంతో తోపుడు బండ్లతో ఖాళీ బిందెలు పెట్టుకుని నీటి కోసం గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి



సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న మహిళలు

ఎమ్మిగనూరు టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు అనుకుని ఉన్న 18వ వార్డు మహిళలు తమకు పరిశుభ్రత, భద్రత కల్పించాలని సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులును, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కోరారు. ఈ సందర్భంగా 18వ వార్డు కాలనీ వాసులు మాట్లాడుతూ పాత ఆంజనేయ స్వామి గుడి దగ్గర కొట్టాలు వేసుకొని జీవనం సాగిస్తుంటామని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వారు , షాపింగ్ కాంప్లెక్స్ వారు మా కొట్టాల పక్కన ఖాళీ స్థలంలోకి వచ్చి మూత్ర విసర్జన, మల మూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్వాసన భరించలేకున్నామని ఇంటి నుంచి బయటకు రావడానికి కూడా ఇబ్బంది పడుతున్నామన్నారు. కాలనీవాసులు సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులకు, కమిషనర్ గంగిరెడ్డిలకు వినతిపత్రం అందజేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పక్షులకు నీరు పోస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కమిటీ రోడ్డు, పార్కు రోడ్డు. సోమప్ప సర్కిల్ పలు ప్రాంతాలలో జరిగే పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. పట్టణంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పక్షులకు నీటి వసతి కొరకు పార్కు, మున్సిపల్ కార్యాలయాలల్లో పాత టైర్లు ఉపయోగించి వాటిపై టబ్‌ను ఏర్పాటు చేసి నీటి సదుపాయం కల్పించామన్నారు. కార్యక్రమంలో డీఈ నీరజ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోండి

గోనెగండ్ల, మే 9(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారు కొత్తరేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కుమారస్వామి కోరారు. అడ్రస్ మార్పు, పేరు మార్పు, కుటుంబంలో కొత్తగా రేషన్ కార్డు అవసరమై వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి స్మార్ట్ రేషన్ కార్డు వస్తుందని తెలిపారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయలేదని అయితే ప్రస్తుతం ప్రభుత్వం అవకాశం ఇచ్చినందున సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గడ్డివాములు దగ్ధం

నందవరం, మే 9(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని కనకవీడు గ్రామంలో శుక్రవారం విద్యుత్ ఘూతంతో రెండు గడ్డివాములు దగ్ధమైయ్యాయి. గ్రామానికి చెందిన బోయ నాగేంద్రకు చెందిన గడ్డివాములు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫర్మర్ దగ్గర తీగలు దగ్గర ఉండడంతో రాపిడికి అంటుకుని అగ్గి రవ్వలు గడ్డివాములపై రాలి పడ్డాయి. రూ. 2 లక్షల నష్టం జరిగినట్లు రైతు వాపొయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు

సమ్మెను జయప్రదం చేయండి



మెప్మా అధికారికి వినతి పత్రం ఇస్తున్ననాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మెప్మా ఆర్పీలకు కనీస వేతనం ఇవ్వాలని, గ్రేడింగ్ విధానం రద్దు చేయాలని నాలుగు లేబర్ చట్టాల రద్దుచేయాలని మే 20న దేశ వ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఆర్పీల చేత శ్రమ దోపిడి చేయించిందని, ఇచ్చిన హామీ మేరకు ఆర్పీలకు ప్రస్తుత వేతనం రూ10వేలు రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మ, సావిత్రి పాల్గొన్నారు.

డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి



సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు మరియు న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల అధ్యక్షులు నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపుతో మూడవ రోజు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కుర్చొని నినాదాలు చేశారు. అధ్యక్షులు నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఇంజనీరింగ్ సెక్షన్‌లో వివిధ భాగాలలో పని చేస్తూ చాలీచాలని జీతాలతో, పెరిగిన ధరలతో జీవనం సాగించడం కష్టమైనది కాబట్టి కనీస వేతనం, ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్ పాల్గొన్నారు.

ఇది ప్రజలు మెచ్చిన ప్రభుత్వం



రాఘవేంద్రరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

● ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి
● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించి ప్రజలు మెచ్చిన పార్టీగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలోని తన నివాసంలో ప్రజా సమస్యలపై పరిష్కార వేదిక నిర్వహించారు. నాలుగు మండలాల నుంచి వందల మంది నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తులు అందజేశారు. ఆధార్, భూ సమస్యలు, గృహాలు, అనారోగ్యం, ముస్లిం, మైనార్టీ విద్యార్థులకు ఉర్దూ ఉన్నత పాఠశాలపై అధికంగా దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలు ఏమైనా ఉంటే తమదృష్టికి తెస్తే మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులతో పాటు ముఖ్యమంత్రి, మంత్రులతో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, ముస్లిం, మైనార్టీ నాయకులు ఆలాంబాషా, రఫీక్, చిన్న ఖాజా, మాబు హుస్సేన్, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం



బంగారు నాణేలతో అభిషేకిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, మే 9 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. శుక్రవారం వైశాఖ ద్వాదశిని పురస్కరించుకుని రాఘవరాయుని బృంధావనానికి పంచామృతాభిషేకం నిర్వహించారు.

ఘనంగా సూవ్రతీంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు

మఠం పూర్వపు పీఠాధిపతులు సూవ్రతీంద్రతీర్థుల మధ్యారాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో సూవ్రతీంద్రతీర్థుల మూల బృంధావనానికి బంగారు, వెండి, పట్టువస్త్రాలు, గులాబీ పుష్పాలతో శోభాయానుమానంగా అలంకరించారు.

స్వామిని దర్శించుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్

రాఘవేంద్రస్వామిని ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ హరే రామ్ నాయక్ దర్శించుకున్నారు. ఈయనకు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, డీఈ మోహినుద్దీన్, సాంబయ్య, ఏఈఈలు వెంకట్రాముడు, నాగమల్లయ్య ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని పీఠాధిపతి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషీ, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, నరసింహమూర్తి, అనంతపురాణిక్, నరసింహ పాల్గొన్నారు.